క్లుప్తంగా

ఎంపీ నిధులతో బస్ షెల్టర్ నిర్మాణం


నిర్మాణం పూర్తయిన బస్‌షెల్టర్

ఓజిలి: మండలంలో పెదపరియ రైల్వేస్టేషన్ సమీపంలో తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి నిధులు రూ.5 లక్షలతో బస్ షెల్టర్ నిర్మాణం చేపట్టారు. నిత్యం ఈ మార్గంలో పెదపరియ, చిలమానుచేను, ఆర్మేనిపాడు, వజ్జవారిపాళెం గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. రైల్వేస్టేషన్ వచ్చే ప్రయాణికుల సౌలభ్యం కోసం బస్ షెల్టర్ నిర్మాణం చేపట్టాలని స్థానిక నాయకులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎంపీ రూ.5 లక్షలు నిధులు కేటాయించారు. నిధులు మంజూరు కావడంతో బస్ షెల్టర్ నిర్మాణం పూర్తి చేశారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు


ప్రసాదం స్వీకరిస్తున్న తహసీల్దార్

సైదాపురం: మండల కేంద్రంలో వెలసిన శ్రీబాల త్రిపుర సుందరీదేవి ఆలయంలో శుక్రవారం ఆలయం భక్తులతో కిటకిటలాడింది. చివరి శ్రావణ శుక్రవారం కావడంతో మండలంలో ఉన్న పలు దేవాలయాల వద్ద భక్తులు బారులు తీరారు. శ్రీబాల త్రిపుర సుందరీదేవి అమ్మవారికి ఉదయం సుప్రభాతం, అభిషేకం, పూలంగిసేవ నిర్వహించారు. అమ్మవారిని వివిధ పుష్పాలు ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. అమ్మవారి నామస్మరణతో ఆలయం మార్మోగింది. అష్టలక్ష్మీ దేవికి అత్యంత వైభవంగా పూజలు చేశారు. అనంతరం దీపారాధనలు చేశారు. అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదానం చేశారు. తహసీల్దార్ సుభద్ర అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆమెకు ఘన స్వాగతం పలికి అమ్మవారి ప్రసాదం సమర్పించారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులపై అక్రమ కేసులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులపై అక్రమ కేసులు బనాయించడం పరిపాటిగా మారుతోంది. డక్కిలి మండలంలోని దేవునివెల్లంపల్లికి చెందిన అన్నదమ్ములు కోళ్లూరు బాలకృష్ణ, శ్రీనివాసులపై పోలీసులు అక్రమ కేసు బనాయించారు. నాలుగు నెలల క్రితం గ్రామంలోని స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయ భూములను కూటమి నాయకులు దుర్వినియోగం చేస్తున్నారని, ఆ భూములను ఆలయానికి అప్పగించాలని పట్టుబట్టారు. దీంతో వీరిద్దరిపై అప్పట్లో కేసు నమోదు చేశారు. అంతటితో ఆగకుండా వారిపై రౌడీషీట్ ఓపెన్ చేసి వేధించడం గమనార్హం. ఈ వేధింపుల్లో భాగంగా ఈ నెల 27వ తేదీ జరగనున్న వినాయక చవితి ఉత్సవాలకు ముందుస్తుగా బైండోవర్ చేసేందుకు వారిని శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. అక్కడి నుంచి తహసీల్దార్ వద్దకు తీసుకెళ్లే ప్రయత్నంలో వాగ్వివాదం చోటు చేసుకుంది. వారిని ఎస్‌ఐ చితకబాది మరో అక్రమ కేసు బనాయించినట్లు సమాచారం.

శ్రావణ శుక్రవార పూజలు

నాయుడుపేటటౌన్: శ్రావణ మాసం చివరి శుక్రవార వ్రతపూజలను మండల పరిధిలోని పలు ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని గ్రామ దేవత పోలేరమ్మ ప్రత్యేక అంకారంలో దర్శనమిచ్చారు. పట్టణంలోని అఖిలాండేశ్వరి దేవికి నిమ్మకాయల అంలకరణ భక్తులను ఆకట్టుకుంది.

చిరంజీవి జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న అభిమానులు

సూళ్లూరుపేట: పట్టణంలోని చిరంజీవి సేవా సంఘం వారి ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. కేక్‌కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు. మధ్యాహ్నం సుమారు 300 మందికి అన్నదానం చేశారు.

వెంకటగిరి రూరల్: మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు శుక్రవారం వెంకటగిరిలో ఘనంగా నిర్వహించారు. జనసేన పట్టణ అధ్యక్షులు అనీల్ రామారావు ఆధ్వర్యంలో శ్రీపోలేరమ్మతల్లి ఆలయం, ఆంజనేయస్వామి దేవస్థానాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

చికెన్ ధరలు 23-8-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	103
లేయర్ లైవ్	:	118
బ్రాయిలర్ చికెన్	:	192
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	212
లేయర్ చికెన్	:	200

దివ్యాంగులకు గడ్డు కాలం

- పింఛన్ల తొలగింపుతో ఆందోళన
- కార్యాలయాలకు పరుగులు

చిల్లకూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద దివ్యాంగుల నిరసన



చిల్లకూరు/ఓజిలి/దీవీసత్రం: గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల వరకు మండల కార్యాలయాల వైపు చూడని దివ్యాంగ పింఛనుదారులు నేడు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పింఛన్ పెంచి ఇస్తామని హామీలు గుప్పించిన నాయకులు దివ్యాంగుల కడుపుకొట్టారు. గూడూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ దివ్యాంగుల పరిస్థితి దారుణంగా మారింది. ఐదు రోజుల నుంచి వారు అష్ట కష్టాలు పడి మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గం దీవీ సత్రం మండలంలో దివ్యాంగులు, అనారోగ్యంతో ఉన్న 134, ఓజిలి మండలంలో 91 మందికి పింఛన్ తొలగిస్తూ నోటీసులు జారీ చేశారు.

మండలం	దివ్యాంగ పింఛన్లు	తొలగించిన పింఛన్లు
గూడూరు అర్బన్	485	176
గూడూరు రూరల్	684	249
చిల్లకూరు	584	182
చిట్టమూరు	375	182
కోట	482	54
వాకాడు	454	23



ఈయన ఓజిలి మండలం మానమాల గ్రామానికి చెందిన ఆనేపూడి శంకర్‌రెడ్డి. ఈయనకు 2007, 2010 సంవత్సరాల్లో సదరం క్యాంపుల్లో వైద్యులు పరీక్షించి వైకల్య ధ్రువీకరణపత్రం అందించారు. ఈయనకు ఎడమ చేతివేళ్లు లేవు. ఈయనకు 1990లోనే రూ.50 దివ్యాంగ పింఛన్ వచ్చేది. ఇటీవల నాయుడుపేటలో జరిగిన సదరం క్యాంపులో వైద్యులు ఈయన్ను అనర్హుడిగా ధ్రువీకరించారు. దీంతో పింఛన్ రద్దు చేస్తున్నట్లు వెల్ఫేర్ అసిస్టెంట్ నోటీసు జారీ చేశారు. దీంతో ఆయన ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.



■ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి చిట్టమూరు దళితవాడకు చెందిన మేజూరు వెంకటేశ్వర్లు. పుట్టుకతోనే ఈయనకు చెవుడు, మూగ. గతంలో వైద్యులు అన్ని పరీక్షలు చేసి దివ్యాంగుల సర్టిఫికెట్ మంజూరు చేశారు. 8 ఏళ్ల నుంచి దివ్యాంగుల పింఛన్ అందుకుంటున్నాడు. ఇటీవల పింఛన్ రూ.6 వేలు పెంచారు. అయితే రెండోసారి సర్వే చేసిన అధికారులు పింఛన్‌కు అర్హత లేదంటూ తొలగించారు. దీంతో ఏమి చేయాలో దిక్కు తోచక ఆయన సైగల ద్వారా అందరినీ అర్థిస్తున్నాడు. ఆయన వేదన ఈ అధికారులకు పాలకులకు ఎప్పుడు అర్థమవుతుందో!



■ ఈయన పేరు మాతంగి శ్రీనివాసులు, చిట్టమూరు మండలం మొలకలపూడి గ్రామస్తుడు. రెండు చెవులు పూర్తిగా వినపడవు. చిన్నతనం నుంచి కాళ్లు సన్నగా ఉండడంతో నడక కూడా కష్టం. ఆయన 12 ఏళ్లుగా దివ్యాంగుల పింఛన్ అందుకుంటున్నాడు. ఆయనకు వచ్చే పింఛన్ నగదుతో అవసరమైన మందులు తెచ్చుకుని వాడుకునే వాడు. నేడు పింఛన్ తీసుకోవడానికి ఆయనకు అర్హత లేదంటూ నోటీసు ఇవ్వడంతో ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. అర్జీలు చేత పట్టుకుని అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు.



■ దీవీ సత్రం మండలం కుప్పారెడ్డిపాళెం గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన బోడి పెద్ద సురేష్ కొన్ని సంవత్సరాల నుంచి దివ్యాంగుల పింఛన్ తీసుకుంటున్నాడు. గతంలో రూ.4 వేలు పింఛన్ వచ్చేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైకల్య పర్సంటేజీ లేదంటూ ఆయన మెడలో అనర్హత బోర్డు తగిలించారు. ఆయన పింఛన్‌ను పూర్తిగా తొలగిస్తూ నోటీసులు జారీ చేశారు. ఆయనకు తల్లి ఉంది ఆమె వృద్ధురాలు.

కాకాణిని కలసిన జెడ్పీటీసీ అనిల్‌రెడ్డి


కాకాణితో జెడ్పీటీసీ సభ్యులు అనిల్‌కుమార్‌రెడ్డి

కలువాయి(సైదాపురం): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో కలువాయి మండల జెడ్పీటీసీ సభ్యులు అనిల్ కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. వీరితోపాటు ఉయ్యాలపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత బాబు ఉన్నారు.

సెప్టెంబర్ 2 నుంచి బ్రహ్మోత్సవాలు

చిట్టమూరు: మండలంలోని మల్లాం గ్రామంలో ఉన్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సెప్టెంబర్ 2 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ఈఓ శశాంక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మయూర ఆగమ శాస్త్ర ప్రకారం ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. 2వ తేదీ మంగళవారం విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలకు అంకురార్పణ చేసి 14వ తేదీ వరకు ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. 2వ తేదీ అంకురార్పణ, 3వ తేదీ ధ్వజారోహణం, 7న నంది సేవ, 8న రథోత్సవం, 9న షణ్ముఖ స్వామి కల్యాణ మహోత్సవం, 10న కల్యాణ రాయబారం, 11న స్వామి, అమ్మవార్ల కల్యాణం, 12న వసంతోత్సవం, ధ్వజావరోహణ, 13న అలకలదోవు, 14న ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు.

కండలేరులో 30.5 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 30.538 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 8200 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1600, పిన్నేరుకాలువకు 30, లోలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

కార్మికుల దీక్ష విరమణ

వెంకటగిరి రూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కరించాలంటూ ఏపీ మునిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో వెంకటగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులతో సీఐ ఏవీ రమణ, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ మేనేజర్ శుక్రవారం చర్చలు జరిపారు. త్వరలో వెంకటగిరిలో పోలేరమ్మతల్లి జాతర రానున్నదని ఈ మేరకు కార్మికులు సహకరించాలని, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామని అధికారులు హామీ ఇవ్వడంతో మున్సిపల్ కార్మికులు దీక్షలు విరమించారు.

ఉపాధి పనుల తనిఖీ

కలువాయి(సైదాపురం): మండలంలోని మాదన్నగారిపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం ఇన్‌చార్జి ఎంపీడీఓ భవాని తనిఖీచేశారు. సమయపాలన చేస్తూ కొలతల ప్రకారం పనులు చేపట్టాలని ఆమె కూలీలకు వివరించారు. పని ప్రదేశంలో గ్రామీణాభివృద్ధి శాఖ నిర్దేశించిన విధంగా పనికి వచ్చినప్పుడు పని నుంచి వెళ్లేటప్పుడు రెండు ఫొటోలు క్షేత్ర స్థాయిలో ఉపాధి హామీ యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రమేష్, ఏపీఓ సునీల్ పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే పూర్తి చేయాలి

చిల్లకూరు : స్వామిత్వలో ప్రతి ఇంటిని సర్వే పూర్తి చేయాలని ఈఓపీఆర్‌డీ శ్రీనివాసులు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయితీలోని గ్రామ కంఠంలోని ఇళ్లను గుర్తించి అక్కడ నివాసం ఉండే వారికి హక్కులు కల్పించేలా స్వామిత్వ సర్వే చేపట్టాలని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నాయుడుపేటటౌన్: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు పట్టణ పరిధిలోని ఎన్‌ఎస్‌ఆర్ కాలనీకి చెందిన రావినూతల రామ స్వామి (22) ఇటీవల చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. దీంతో అతని తల్లి మందలించింది. మనస్తాపం చెందిన రామస్వామి ఈ నెల 20వ తేదీ ఇంటి వద్ద గడ్డి మందు తిని అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే అతడిని ఆస్పత్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. శనివారం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం చేయనున్నట్లు వెల్లడించారు.

చెత్తసంపద కేంద్రాలను ఉపయోగించుకోవాలి


చెత్త తరలింపును పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

ఓజిలి: గ్రామ పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు చెత్తసంపద కేంద్రాలను ఉపయోగించుకుని సేంద్రియ ఎరువును తయారుచేయాలని ఎంపీడీఓ విజయలక్ష్మి సూచించారు. మండలంలోని వజ్జవారిపాళెం, భువనగిరిపాళెం గ్రామాల్లో పారిశుధ్య పనులను శుక్రవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు చెత్తను ఎక్కడబడితే అక్కడ వేయకుండా పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఈమె వెంట పంచాయతీ కార్యదర్శి ధరణి ఉన్నారు.

రాజరాజేశ్వరీదేవికి పసుపుతో అభిషేకం

చిల్లకూరు: గూడూరు పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ రోడ్డులో వెలసిన రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా 1008 కిలోల పసుపుతో అభిషేకం చేశారు. అమ్మవారి ఆలయాన్ని రకరకాల పుష్పాలతో అందంగా అలంకరించి, పసుపుతో అభిషేకం గావించారు. భక్తులకు అమ్మవారి ఆలయ ఆవరణలో వరలక్ష్మీ వ్రతాన్ని అత్యంత భక్తి శ్రద్ధల నడుమ నిర్వహించారు. భక్తులు సుమారు 3 వేల మందికి పైగా హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సరస్వతి శిశు మందిరంలోనూ వరలక్ష్మీ వ్రతం భక్తి శ్రద్ధల నడుమ నిర్వహించారు.

ఆదిలక్ష్మీదేవికి ప్రాకారోత్సవం


పెంచలకోనలో ఆదిలక్ష్మీదేవికి ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలో స్వయంభుగా వెలసిన ఆదిలక్ష్మీదేవికి శుక్రవారం ఆస్థానసేవ, ప్రాకారోత్సవం, కుంకుమార్చన పూజ చేశారు. శ్రావణమాసం చివరి శుక్రవారం కావడంతో ఆదిలక్ష్మీదేవిని ఆలయం ముందు ఏర్పాటు చేసిన పద్మపీఠంపై కొలువుదీర్చి వివిధరకాల పుష్పాభరణాలతో అలంకరించి సహస్రనామార్చన, ఆస్థాన సేవ నిర్వహించారు. అనంతరం మేళతాళాలు మంగళవాయిద్యాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు, ప్రాకారోత్సవాన్ని (ప్రదక్షిణలు) నిర్వహించి మహిళలచే కుంకుమార్చన సేవ నిర్వహించారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం


ప్రభుత్వ వైద్యశాల స్థలం చదును చేస్తున్న జేసీబీ

నాయుడుపేటటౌన్ : పట్టణంలో రైల్వే స్టేషన్ సమీపంలో జీఎన్‌టీ రోడ్డు అనుకుని ఉన్న ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నిస్తున్నారు. ఎన్నో వివాదాల మధ్య పట్టణంలోని ప్రభుత్వ సామాజిక వైద్యశాలకు కేటాయించిన కోట్లు విలువ చేస్తే స్థలాన్ని అధికార పార్టీ నేత దర్జాగా కబ్జా చేసేందుకు జేసీబీతో పనులు చేస్తున్నారు. పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి నిత్యం రద్దీగా ఉంటోంది. దీంతో జీఎన్‌టీ రోడ్డు పక్కన ఈశాన్య దారి కోసం పట్టణానికి చెందిన ప్రైవేటు వ్యక్తి స్థలాన్ని 5 సెంట్ల వరకు తీసుకున్నారు. సుమారు 25 ఏళ్ల కిందట అప్పటి మంత్రిగా దివంగత నాయకులు పసల పెంచలయ్య ప్రత్యేక చొరవ చూపి ప్రభుత్వ వైద్యశాలకు మరో దారి ఏర్పాటు చేశారు. వైద్యశాలకు 5 సెంట్లు స్థలం ఇచ్చిన ఆ వ్యక్తికి పట్టణంలో బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం సమీపంలో 5 సెంట్ల కంటే అదనంగా ప్రభుత్వ స్థలం కేటాయించారు. అయితే ప్రభుత్వ వైద్యశాలకు ఈశాన్యంలోని 5 సెంట్ల స్థలంలో ఉన్న దారిని ప్రస్తుతం అంతగా ఉపయోగించడం లేదు. ఇదే అదనుగా ఆ స్థలం పక్కనే అధికార పార్టీ చెందిన వ్యక్తికి చెందిన స్థలం ఉండడంతో జేసీబీతో చదును చేస్తున్నారు. తన స్థలంలో ప్రభుత్వ స్థలాన్ని కలుపుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ విషయమై ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ అమర్‌నాథ్ మాట్లాడుతూ ఉన్నతాధికారులకు నివేదించి ఆ స్థలం ఆక్రమణకు గురి కాకుండా చర్యలు చేపడతామన్నారు.


ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లే మార్గంలో చదును చేసిన స్థలం

వైభవంగా సీతారాముల కల్యాణం


సీతారాముల కల్యాణం చేస్తున్న అర్చకులు

కోట: మండలంలోని గూడలి దక్షిణ పొలంలోని మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతారామ ధార్మిక సేవా సంస్థ సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి జిల్లా అర్చక సలహా మండలి సభ్యుడు అనంతాచార్యులు బృందం వైఖానస ఆగమోక్తంగా సీతారాముల కల్యాణం జరిపించారు. ఈ కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, శివరామమ్మ, కోటేశ్వరి, వీరరాఘవరెడ్డి, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణ మహోత్సవం


ఆలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు , కల్యాణంలో పాల్గొన్న భక్తులు

రాపూరు: మండలంలోని ఆకలివలస సమీపంలో వెలసిన బుగ్గేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మాస శివరాత్రిని పురస్కరించుకుని శివపార్వతుల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు స్వామి వారికి పంచామృత అభిషేకం, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. 11 గంటలకు శివపార్వతుల విగ్రహాలను కొలువుదీర్చి వివిధరకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ శివపార్వతుల కల్యాణాన్ని అర్చకులు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఉభయకర్తలుగా డేగా చంద్రశేఖరరెడ్డి, నారాయణ రెడ్డి, రవీంద్రారెడ్డి, వెంకటనరసారెడ్డి కుటుంబసభ్యులు వ్యవహరించారు.

విద్యాసంస్థల్లో భారత్ దర్శన్

కలువాయి(సైదాపురం): మండలంలోని కేశమనేనిపల్లి, వెరుబొట్లపల్లి పాఠశాలలు, కలువాయి కుల్లూరు కళాశాలల్లో శుక్రవారం భారత్ దర్శన్ కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ వైస్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో భారతదేశ ఔన్నత్యాన్ని స్వతంత్ర సమరయోధుల త్యాగాన్ని విద్యార్థులకు వివరించారు.


అవగాహన కల్పిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు

భక్తులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

కోట: శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా కోట గ్రామదేవత కోటమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. అమ్మవారి పల్లకీ ఉత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, ఉభయకర్తలు పసుపులేటి కిషోర్, డాక్టర్ దివ్యప్రియ దంపతులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం


మండపంలో కొలువుదీరిన అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు


వరలక్ష్మీవ్రతం ఆచరిస్తున్న మహిళా భక్తులు

సూళ్లూరుపేట : పట్టణంలోని కాళంగి నదీతీరాన వెలసిన శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలోని ఆస్థాన మండపంలో శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి సామూహిక వరలక్ష్మీ వ్రతం పూజా కార్యక్రమాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ బీ ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో వరలక్ష్మీ వ్రతం ఆచరించారు. ఆస్థాన మండపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేకంగా అలంకరించి వరలక్ష్మీ వ్రతం పూజలు చేశారు. ఉభయకర్తలుగా చిట్టేటి పెరుమాళ్లు, భాస్కరాచారి, కర్లపూడి సురేష్ బాబు, దర్శి శ్రీనివాసరావు వ్యవహరించారు.